క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చంద్రగిరి : సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ చిన్నరెడ్డెప్ప శుక్రవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని వెల్లడించారు.

గంగమ్మకు రూ.లక్ష విరాళం



చెక్ అందిస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి తాతానగర్‌కు చెందిన కె.జ్యోతి, వాసు నాయుడు శుక్రవారం రూ.లక్ష విరాళం అందించారు. చెక్‌ను ఆలయ కమిటీ చైర్మన్ మైనార్ మహేష్ యాదవ్, ఈఓ ఏ.జయకుమార్‌కు అందజేశారు.

అక్రమంగా తరలిస్తున్న టపాసులు స్వాధీనం

తిరుపతి క్రైమ్ : తిరుపతి జిల్లా పరిధిలోని వేర్వేరు ప్రాంతాలలో అక్రమంగా తరలిస్తున్న అనుమతి లేని టపాసులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల మేరకు... అలిపిరి పోలీస్ స్టేషన్, రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కంటైనర్‌లో అనుమతి లేకుండా తరలిస్తున్న టపాసులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటన్నింటినీ దీపావళి పండుగకు విక్రయించేందుకు తీసుకొచ్చినట్లుగా గుర్తించామన్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బధిరత్వ నివారణపై శిక్షణ

తిరుపతి తుడా: అంతర్జాతీయ బధిర, దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా బధిరత్వ నివారణ మీద జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్ తన కార్యాలయంలో నిర్వహించారు. బధిరత్వ కారణాలు–నివారణ, నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, వివిధ చికిత్సా పద్ధతుల గురించి ఆయన శిక్షణ ఇచ్చారు. సైగల భాష ఆవిర్భావం, దాని ప్రాముఖ్యత, ప్రాథమిక సంభాషణా విధానాలపై అవగాహన కల్పించారు. వీలైనంత త్వరగా బధిరత్వాన్ని గుర్తించి, స్పీచ్ థెరపీ ఇవ్వాలని, చెవికి శస్త్ర చికిత్స చేసి వినికిడి పరికరం అమర్చితే బధిర సమస్య నుంచి విముక్తి కల్పించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎం.నిర్మలాదేవి, డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలాజీ రైల్వే డివిజన్‌పై చర్చ రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : తిరుపతిని బాలాజీ రైల్వే డివిజన్ చేయాలనే డిమాండ్‌తో ఆదివారం ఉదయం 10 గంటలకు కచ్చపి ఆడిటోరియంలో చర్చా సమావేశం నిర్వహించనున్నట్లు డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఈ మేరకు చర్చా సమావేశం పోస్టర్ ఆవిష్కరించారు. నేతలు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్ బాబు, శ్రీధర్, బి.శ్రీధర్‌బాబు, నీలాద్రి, లోకనాథం పాల్గొన్నారు.

మైండ్ 'బ్లాంక్'!

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 500 పోస్టులకుపైగా బ్లాక్
- నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా కౌన్సెలింగ్
- నష్టపోయామంటున్న నూతన అయ్యోర్లు



తిరుపతి జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి పోస్టింగ్‌ల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : కొత్తగా ఉద్యోగంలోకి వచ్చిన డీఎస్సీ నూతన టీచర్లకు కూటమి ప్రభుత్వం శఠగోపం పెట్టింది. ఈ నెల 9, 10 తేదీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్వహిస్తున్న పోస్టింగ్‌ల కౌన్సెలింగ్ ప్రక్రియను నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తోంది. తమకు నచ్చిన విధంగా కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టింది. పోస్టింగ్‌ల కౌన్సెలింగ్‌లో నిబంధనలను అమలు చేయకుండా సూచించిన చోటే కోరుకోవాలని నియంతృత్వంగా వ్యవహరిస్తోంది. ఏకంగా 500 పోస్టులకు పైగా బ్లాక్ చేయడం దుమారం రేపుతోంది.

ఎప్పుడూ ఇలా లేదు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా హెచ్‌ఆర్‌ఏ పేరుతో (కేటగిరీ 1, 2) పోస్టులను 500కు పైగా బ్లాక్ చేశారు. కొత్త టీచర్లకు హెచ్‌ఆర్‌ఏ పోస్టులు ఇవ్వకూడదనే నిబంధన ఎక్కడా లేదు. ఇలా బ్లాక్ చేసిన పోస్టులన్నీ ప్రధాన ప్రాంతాల్లో ఉండడంతో వాటిని డిప్యూటేషన్స్ (ప్రభుత్వ ఆర్డర్) పేరుతో దోచుకునేందుకు కుట్ర చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గతంలో డీఎస్సీ పోస్టింగ్‌లు ఇచ్చే సమయంలో పోస్టులను బ్లాక్ చేసిన సందర్భాలు లేవని యూనియన్ నాయకులు వాదిస్తున్నారు.

లోగుట్టుగా కౌన్సెలింగ్ ప్రక్రియ

తిరుపతి జిల్లా కేంద్రంలో ఎస్జీటీలకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియ లోగుట్టుగా నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. కౌన్సెలింగ్ నిర్వహించకముందే నూతన టీచర్లకు ముందస్తుగా ఖాళీలను చూపించాల్సి ఉంటుంది. అయితే అలా చేయకుండా మోసం చేశారు. అక్రమాలను ప్రశ్నిస్తారని ఉపాధ్యాయ సంఘ నాయకులను లోనికి అనుమంతించలేదు. కౌన్సెలింగ్ ప్రక్రియను అర్ధరాత్రిలో ప్రారంభించి వేకువ జాము వరకు నిర్వహించారు. ఒకే ప్రాంతంలో నూతన టీచర్లందరికీ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించాల్సి ఉండగా, అలా చేయకుండా కొందరికి ఒక కేంద్రంలో, మరికొందరికీ మరొక కేంద్రంలో నిర్వహించారు. తిరుపతి జిల్లా కేంద్రంలో విశ్వం పాఠశాల శిక్షణా కేంద్రంలో ఈ నెల 9న ఉదయం 4.30 గంటల వరకు 1 నుంచి 250 వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. అదేవిధంగా ఈ నెల 10న మెడ్జీ స్కూల్‌లో వరుస సంఖ్య 250 కు పైన ఉన్న వారిని ఉదయం 7 గంటలకు కౌన్సెలింగ్‌కు పిలిపించి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిరీక్షింపజేశారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ ప్రక్రియను మొదలుపెట్టారు.

దివ్యాంగ ఉపాధ్యాయులకు అన్యాయం

డీఎస్సీలో ఎంపికైన దివ్యాంగ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ప్రక్రియలో అన్యాయం చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో వారికున్న రిజర్వేషన్, రోస్టర్ల ప్రకారం ముందస్తుగా పిలువాల్సి ఉంటుంది. అయితే అలా చేయకుండా చివర్లో కౌన్సెలింగ్ నిర్వహించి దివ్యాంగ టీచర్లకు అన్యాయం చేశారు.

అవకతవకలు ఇలా...

- ఖాళీల జాబితాల్లో అవకతవకలు జరిగాయని నూతన టీచర్లు ఆరోపిస్తున్నారు. తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో టీచర్లను కేటాయించారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో టీచర్లనే నియమించలేదు. దీంతో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళంగా మారింది.
- సీఎం సొంత నియోజకవర్గం అయిన కుప్పంలోనే అవకతవలు చోటు చేసుకున్నాయి. శాంతిపురం మండలం, శెట్టిబల్ల మోడల్ ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులు న్నారు. ఆ పాఠశాలలో పోస్టులు 4 ఉన్నాయి. ఈ పాఠశాలలో ఖాళీలే లేనట్లు వేకెన్సీ జాబితాలో చూపించారు.
- శాంతిపురం మండలం శెట్టిపల్లి ప్రాథమిక మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులు 12 మందే ఉన్నారు. ఆ పాఠశాలలో శాంక్షన్ పోస్టు 1 ఉంది. అయితే ప్రస్తుత డీఎస్సీ పోస్టింగ్ ప్రక్రియ ఖాళీల జాబితాలో ఆ పాఠశాలలో 3 పోస్టులను నియమిస్తున్నట్లు చూపిస్తున్నారు.
- తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పోస్టుల ఖాళీలను చూపించలేదు.
- సబ్జెక్టు టీచర్లు అవసరం ఉన్నప్పటికీ హెచ్‌ఆర్‌ఏ ప్రాంతాల్లో పోస్టులు ఉన్నా చూపించకుండా కౌన్సెలింగ్ నిర్వహించారు.
- తొట్టంబేడులో 1, శ్రీకాళహస్తిలో 2 ప్రభుత్వ మేనేజ్‌మెంట్ స్కూల్స్ ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఖాళీలు ఉన్నప్పటికీ చూపించకుండా బ్లాక్ చేశారు.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఊరట

తిరుపతి రూరల్ : ఏపీలో కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేస్తున్న లిక్కర్ స్కాం కేసులో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. లిక్కర్ అక్రమ కేసులో 39వ నిందితుడిగా సిట్ అధికారులు చేర్చడంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను విచారణకు తీసుకున్న హైకోర్టు ధర్మాసనం కొంత కాలం ఇంటీరియం ఆర్డర్‌ను మంజూరు చేసినప్పటికీ ఈనెల 7వ తేదీన ఆ ఆర్డర్‌ను కొట్టివేసింది. దీంతో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అరెస్టు తప్పదని అందరూ భావించారు. అయితే ఆయన తనకు ఏ సంబంధంలేని లిక్కర్ స్కాం కేసులో అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేయడానికి సిట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారని, ఆ కేసులో తనను అరెస్టు నుంచి తప్పించాలని సర్వోన్నత న్యాయస్థానానికి విన్నవించారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాదులు నిఖిల్ గోయల్, షాహిల్ రవీన్ వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం, సిట్ అధికారుల నుంచి సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్ధార్థ్ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్ వాదించారు. ఇరు పక్షాల వాదనలను విన్న ధర్మాసనం చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అరెస్టు చేయవద్దని ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు ఏపీ ప్రభుత్వానికి, సిట్ అధికారులకు నోటీసులు పంపుతూ ఈ కేసులో అఫిడవిట్లు ఫైల్ చేయడానికి నాలుగు వారాల సమయం కేటాయించి కేసును వాయిదా వేసింది. దీంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి భారీ ఊరట లభించినట్లయ్యింది.

సీఎంఆర్ కర్మాగారంలో అగ్నిప్రమాదం

- 8 మంది కార్మికులకు అస్వస్థత
- ఎగసిపడిన మంటలు
- భయంతో కార్మికులు పరుగులు



ఏర్పేడు మండలం చింతలపాలెం టోల్‌గేట్ సమీపంలో సీఎంఆర్ ఎకో కర్మాగారం నుంచి ఎగసిపడుతున్న మంటలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికురాలు

ఏర్పేడు : మండలంలోని చింతలపాళెం టోల్‌గేట్ సమీపంలోని సీఎంఆర్ ఎకో అల్లైవీల్ తయారీ పరిశ్రమలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా మంటలు దట్టమైన పొగతో వ్యాపించటంతో ఫ్యాక్టరీలో పని చేస్తున్న సుమారు 200 మంది కార్మికులు, సిబ్బంది భయంతో రోడ్డుపైకి పరుగులు తీశారు. 8 మంది మహిళా కార్మికులు అస్వస్థతకు గురి కావడంతో వారిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు. చింతలపాళెం టోల్‌గేట్ సమీపంలోని ద్విచక్ర వాహనాలు, 4 వీలర్స్ వాహనాల అల్లైవీల్స్‌ను తయారు చేస్తారు. శుక్రవారం సాయంత్రం కర్మాగారం పై భాగంలో ఓ పైపు గుండా వెళ్లే ఆయిల్ లీక్ కావడంతో షార్ట్ సర్క్యూట్ అయి మంటలు వ్యాపించాయి. నిమిషాల వ్యవధిలో దట్టమైన పొగతో కూడిన మంటలు ఎగసిపడటంతో ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు, సిబ్బంది భయాందోళనతో రోడ్డు మీదకు పరుగులు తీశారు. మంటలు ఫ్యాక్టరీ లోపలకు వ్యాపించకుండా పైకి ఎగసిపడటంతో కర్మాగారం లోపల ఉన్న కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు. మంటలు లోపలకు వ్యాపించి ఉంటే ఊహకందని విపత్తు జరిగి ఉండేది. ప్రమాద విషయం తెలుసుకున్న జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య ప్రమాద స్థలానికి చేరుకున్నారు. శ్రీకాళహస్తి, వెంకటగిరి, తిరుపతి నుంచి మూడు అగ్నిమాపక వాహనాలను తీసుకొచ్చి మంటలను అదుపు చేశారు. ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు ఎనిమిది మందికి శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులు తలెత్తి అస్వస్థతకు గురై కళ్లు తిరిగి పడిపోయారు. అస్వస్థతకు గురైన వారిలో శాంతి, మధుప్రియ, గురవమ్మ, వెంకటమ్మ, ప్రియ తదితరులు ఉన్నారు. వారిలో ఆరుగురిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఒక యువతిని మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరిని రేణిగుంట సమీపంలోని బాలాజీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, శ్రీకాళహస్తి ఆర్‌డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దార్ ఎం.భార్గవి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల స్ఫూర్తితో పనిచేద్దాం

- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్



మాట్లాడుతున్న ఈవో ఏకే సింఘాల్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల విజయ స్ఫూర్తితో పనిచేసి తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి, రథసప్తమి వేడుకలను జయప్రదం చేయాలని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ పిలుపు నిచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల అనంతరం శుక్రవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో పాలక మండలి సభ్యులు, జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ విభాగం, టీటీడీలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయం, శ్రీవారి సేవకుల సేవలు, భక్తులు, మీడియా సమష్టి సహకారంతో విజయవంతం చేయగలిగామన్నారు. అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలకు ప్రణాళికాబద్ధంగా సౌకర్యాలు కల్పించేలా మూడు నెలల ముందు నుంచే మార్గదర్శిని రూపొందించామన్నారు. జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ.. ప్రతి రోజూ అధికారులతో సమీక్షించుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అందరూ ఒక టీం వర్క్‌గా పని చేశారన్నారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. భక్తుల రద్దీని నియంత్రించేందుకు క్యూలైన్లు ఏర్పాటు, టీటీడీ, విజిలెన్స్ , పోలీసులు సమన్వయంతో పనిచేశారన్నారు. సీవీఎస్వో మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఈ ఏడాది అదనంగా 40 వేల మంది భక్తులు వచ్చినా పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ, పోలీసు అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోగి సహాయకురాలిపై ఆస్పత్రి సిబ్బంది దాడి



రుయా అత్యవసర విభాగం వద్ద దాడి చేసిన ఎంఎన్‌ఓ తీరును ఆక్షేపిస్తున్న బాధితుడి బంధువులు

తిరుపతి తుడా : రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన సోదరుడిని చూసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన సహాయకురాలిపై రుయా సిబ్బంది దాడికి తెగబడ్డారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం రుయాలో చోటు చేసుకుంది. తిరుపతికి చెందిన సాయిరాం చిత్తూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స కోసం ఆయనను రుయాకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రుయాకు చేరుకున్నారు. ఉన్న ఎంఎన్‌ఓ సహాయకుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. బాధితుడి అక్కపై వెనుక నుంచి చేయి చేసుకోవడంతో మహిళలు ఆగ్రహించారు. అత్యవసర విభాగం నుంచి బంధువులను బయటకు గెంటేశారు. దీంతో గాయపడ్డ సాయిరాం బంధువులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల సిబ్బంది ఇంత దారుణంగా వ్యవహరిస్తారా అంటూ నిలదీశారు. రుయాలో వైద్య సేవలు క్షీణించాయని, ప్రవర్తన కూడా మర్యాదపూర్వకంగా లేదని బాధితురాలు పద్మజ మండిపడ్డారు. దాడికి పాల్పడ్డ ఎంఎన్‌ఓ పై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

ఘనంగా మానసిక ఆరోగ్య దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యాధికారులు

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో శుక్రవారం ఘనంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఎస్వీ వైద్య కళాశాల నుంచి స్విమ్స్ వరకు ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపల్ రవిప్రభు, డాక్టర్ పద్మావతి, డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు

స్విమ్స్ సైకియాట్రీ విభాగం ఆధ్వర్యంలో..

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవానికి ముఖ్యఅతిథిగా డీన్ డాక్టర్ అలోక్ సచన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ భావోద్వేగాలను నియంత్రించుకోవాలని సూచించారు. సైకియాట్రిస్ట్ విభాగాధిపతి డాక్టర్ గణేష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్గాంజలి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, వైద్యులు

మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో..

పాకాల : మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం సుమలత, టీచర్ కౌన్సిలర్ వనపర్తి వెంకటసిద్దులు, ఉపాధ్యాయులు సుల్తాన్, బాబు, రామమూర్తి, నీరజ, ప్రమోదిని, సీఆర్పీ మునికృష్ణ పాల్గొన్నారు.

టీటీడీకి రూ.10 లక్షల విరాళం



అదనపు ఈవోకు డీడీ అందజేస్తున్న దాతలు

తిరుమల : టీటీడీ బోర్డు సభ్యుడు దర్శన్ శుక్రవారం టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం అందించారు. తిరుపతిలోని అదనపు ఈవో బంగ్లాలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి దాత విరాళం డీడీ అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. భక్తులు వేచి ఉన్న క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 66,883 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,000 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి హుండీలో రూ.4.15 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

చంద్రగిరి : తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మావతి నగర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో శుక్రవారం దాడులు చేపట్టారు. స్థానికంగా ఉండే జ్యోతి అనే మహిళ బయట నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం వ్యభిచార గృహంలో ఉన్న ముగ్గురు మహిళలను, ఆర్గనైజర్ జ్యోతితో పాటు ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్నారు. వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళలను హోంకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం జ్యోతితో పాటు ముగ్గురు విటులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సునీల్ కుమార్ వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్ : నగరంలోని మాధవ్‌నగర్ లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మాధవ నగర్ లో నివాసం ఉంటున్న కృష్ణ (29) కుటుంబ సమస్యలతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఇంతలో చుట్టుపక్కల వారు గమనించి.. పోలీసులకు సమాచారం అందించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లుగా.. పోలీసులు నిర్ధారించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. బాధితుడి తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ లోకేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న 'మంత్ర'

- వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు
- అలరించిన నృత్యాలు, స్పోర్ట్స్ ఈవెంట్



విద్యార్థులతో కలసి గేమ్స్ ఆడుతున్న ఛాన్సలర్ మంచు మోహన్ బాబు



ఎం బ్లాక్ వద్ద డ్యాన్స్‌లతో ఆకట్టుకుంటున్న విద్యార్థులు

చంద్రగిరి : ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మోహన మంత్ర–2025 మహోత్సవం మోహన్ బాబు యూనివర్సిటీ (ఎంబియు)లో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని, వారి మేధస్సును, వెలికితీయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వచ్చిన ప్రతి విద్యార్థిని అతిథులుగా భావించి వారికి తగిన సౌకర్యాలు కల్పించామన్నారు.

సందడి చేసిన మోహన్ బాబు

మోహన మంత్ర–2025 కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ ఛాన్సలర్ మంచు మోహన్‌బాబు సందడి చేశారు. యూనివర్సిటీలో నిర్వహిస్తున్న వివిధ ఈవెంట్‌లను ఆయన స్వయంగా వెళ్లి తిలకించారు. అనంతరం కొన్ని చోట్ల ఆయన విద్యార్థులతో పాటు ఆయన ఈవెంట్‌లో పాల్గొని సందడి చేశారు. అదే విధంగా ప్రో ఛాన్సలర్ విష్ణు విద్యార్థులతో డ్యాన్సులతో జత కలసి రెట్టింపు ఉత్సాహాన్ని ఇచ్చారు.

ఉత్సాహంగా ఈవెంట్స్

కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు టెక్నోహోలిక్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఎంబెడెడ్ వర్క్‌షాప్, కోడ్ స్ప్రింట్, లైఫ్ సేవర్ వర్క్‌షాప్, ఈవీ వర్క్‌షాప్, టెక్ ఎక్స్–ప్రోటోటైప్, ఈవీ ఈక్స్‌పో, క్యూజోనోమిక్స్‌లు ఆకట్టుకున్నాయి. కళాక్షేత్ర, స్పోర్ట్స్ ఈవెంట్‌లో భాగంగా లెట్స్ నాచో, చికెన్ డిన్నర్(పబ్జీ), కరోకే కెచప్, పుష్ అప్ ఛాలెంజ్– ఎంప్రొజా ఈవెంట్లు విద్యార్థులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అలాగే ఫ్రీ ఫైర్, గల్లీ క్రికెట్, మిక్స్‌డ్ బాస్కెట్ బాల్, ట్రెజర్ హంట్, లక్కీ డ్రా, ఫన్ గేమ్స్, ఫుడ్ ఛాలెంజ్, జార్బింగి బాల్స్ వంటి ఈవెంట్లు ఆకట్టుకున్నాయి.

అదరగొట్టిన డ్రమ్స్ శివమణి డీజే

మోహన మంత్ర–2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీ విద్యానికేతన్‌లో మైదానంలో నిర్వహించిన డీజే కార్యక్రమం అదరగొట్టింది. ఈ సందర్భంగా ప్రముఖ వాయిద్యకారుడు డ్రమ్స్ శివమణి తన సంగీతంతో విద్యార్థులను అలరించారు.

యల్లంపల్లెలో ఏనుగుల గుంపు

చంద్రగిరి : మండలంలోని యల్లంపల్లె వద్ద పంట పొలాల్లోకి శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు ప్రవేశించింది. వెంటనే రైతులు ఏ.రంగంపేట అటవీ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సిబ్బంది ఆలస్యంగా రావడంతో ఏనుగులు పంటను పూర్తిగా నాశనం చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్వీయూలో వేతన వెతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఉద్యోగులకు ప్రతి నెలా వేతన వెతలు తప్పడం లేదు. ఈ నెల 11వ తేదీ వచ్చినప్పటికీ జీతాలు జమ కాకపోవడంతో ఉద్యోగులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈఎంఐలు, నెలవారీ రుణాలు, వడ్డీలు చెల్లించలేక అపరాధ రుసుము బారిన పడుతున్నారు. కుటుంబం అవసరాలు తీర్చుకోలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. జీతాల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

టీడీపీకి గుణపాఠం తప్పదు

తిరుపతి కల్చరల్ : వాస్తవాలను వక్రీకరించి అసత్య ప్రచారంతో కుట్రలకు తెగబడుతూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న టీడీపీకి రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆరె అజయ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. చిత్తూరు జిల్లా దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహం తగులబెట్టిన ఘటన వెనుక మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి హస్తం ఉందంటూ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ ఆరోపించడం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టని మండిపడ్డారు. దీనికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. విగ్రహానికి సర్పంచ్ గోవిందయ్య నిప్పుపెట్టలేదని, పక్కనే ఉన్న చిన్న బంకు దగ్ధం కావడంతో కమ్ముకున్న పొగ కారణంగా విగ్రహం మసిబారినట్లు ఎస్పీ వెల్లడించారని చెప్పారు. దీంతోనే టీడీపీ నేతల డైవర్షన్ పాలిటిక్స్ బయటపడ్డాయని వివరించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటును అడ్డుకున్న సతీష్ నాయుడే తగులబెట్టారనే అనుమానంతో సర్పంచ్ గోవిందయ్య కేసు పెట్టినా దానికి విచారించక, తిరిగి సర్పంచ్‌పైనే కేసు పెట్టి జైలుకు పంపడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణస్వామి 40 ఏళ్లుగా కింద స్థాయి నుంచి డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగారిని, అనేక అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సమావేశంలో నేతలు తలారి రాజేంద్ర, కోటూరి ఆంజనేయులు, మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ప్రతిభ చూపితేనే విజయం



మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యంరెడ్డి

తిరుపతి రూరల్ : ఆటలపై శ్రద్ధ పెట్టి ప్రతిభ చూపితేనే విజయం వరిస్తుందని ప్రధానోపాధ్యాయుడు హరినాథరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మార్‌పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. అండర్–14, 17 బాలబాలికలు హాజరై సత్తా చాటారు. పీడీ అసోసియేషన్ సెక్రటరీ బాలసుబ్రమణ్యం రెడ్డి, స్కూల్ గేమ్స్ సెక్రటరీలు ఎల్.భార్గవి, కిషోర్, పీడీ అసోసియేషన్ డివిజన్ కో–ఆర్డినేటర్ నిరంజన్ రెడ్డి, మండల కో–ఆర్డినేటర్ విద్యాలత, పీడీ హిమబిందు పాల్గొన్నారు.

క్లస్టర్‌గా తిరుచానూరు రైల్వేస్టేషన్



మాట్లాడుతున్న సీసీఐ శ్రీకాంత్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుచానూరు రైల్వే స్టేషన్‌ను క్లస్టర్‌గా అభివృద్ధి చేసినట్లు రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ (సీసీఐ) శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం తిరుచానూరు రైల్వేస్టేషన్‌లో ఆయన మాట్లాడారు. సుమారు రూ.120 కోట్ల అంచనా వ్యయంతో ఆధునీకరణ పనులు పూర్తిచేసి, దశలవారీగా తిరుచానూరు నుంచి రైళ్లు నడపడానికి నిర్ణయించినట్లు చెప్పారు. సీసీఐ చలపతి, ఆర్పీఎఫ్ ఎస్ఐ రాజేంద్ర, టీఐలు శ్రీనివాస్, మురళీకృష్ణ పాల్గొన్నారు.



గౌరవ్ వెంకట్‌కు చెస్ ఫైడ్ రేటింగ్



తిరుపతి ఎడ్యుకేషన్ : అంతర్జాతీయ చెస్ అసోసియేషన్ ఇటీవల చెస్ ఫైడ్ రేటింగ్‌ను ప్రకటించింది. అందులో తిరుపతికి చెందిన చెస్ క్రీడాకారుడు తోట గౌరవ్ వెంకట్‌కు బ్రిడ్జి విభాగంలో 1523వ రేటింగ్ ఇచ్చింది. శుక్రవారం ఈ మేరకు గౌరవ్ వెంకట్‌కు చెస్ కోచ్ పీఆర్ ఆనందమోహన్‌తో పాటు పలువురు అభినందనలు తెలిపారు.



ఇంటి స్థలాల కోసం ధర్నా

తిరుపతి రూరల్ : ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలోని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఎం నేతల ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యవర్గ సభ్యుడు కందారపు మురళిలు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2,740 మందిని అర్హులుగా గుర్తించి పట్టాలు ఇచ్చినప్పటికీ వారికి స్థలం కేటాయించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అప్పట్లో టీడీపీ చంద్రగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి పులివర్తి నాని సైతం తమ ప్రభుత్వ రాగానే పేదలకు టిడ్కో ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఇప్పటి వరకు ఒక్క సెంటు స్థలం కూడా పేదలకు అందించలేదని మండిపడ్డారు. ఆర్‌డీఓ రామ్మోహన్ మాట్లాడుతూ ఆరు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నేతలు వేణుగోపాల్, మాధవ్, బుజ్జి, నరేంద్ర, జయంతి, మునిరత్నం, మోదిన్, చల్లా చిన్న వెంకటయ్య, బాదుల్లా, లోకయ్య, హమీద్, వెంకటేష్, గంగాధరం పాల్గొన్నారు.

ఎస్వీయూ వీసీకి సత్కారం



వీసీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

తిరుపతి సిటీ : ఎస్వీయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన తాతా నర్సింగరావును బోధనేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఈ మేరకు నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, సుబ్రమణ్యం పుష్పగుచ్ఛం అందించారు. అలాగే వర్సిటీ హాస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అ, కార్యదర్శులు బ్రహ్మానందరెడ్డి, షణ్ముగం అభినందనలు తెలిపారు.

వెంకన్న ఆలయంలో తప్పిన ప్రమాదం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయ ఆవరణలో ఉన్న భారీ వేప చెట్టు కొమ్మ శుక్రవారం ఉదయం విరిగిపడింది. దీంతో ప్రాంగణంలోని విద్యుత్ తీగలు, ఇనుప పైపులు, పందిరి పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆ సమయంలో భక్తులు రద్దీ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొమ్మలను ఆలయ సిబ్బంది తొలగించారు.

జాగరూకతపై అవగాహన

పాకాల : ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాగరూకత వారోత్సవాలను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాకాల బ్రాంచ్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సి.అశోక్, ఆర్‌డీఓ వి.కీర్తన ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భరణి సమక్షంలో 2025 విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు పుణ్యవతి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో రెండు రోజులుగా నిర్వహించిన ఇంటర్ కాలేజ్ పురుషుల జూడో, కరాటే, తైక్వాండో టోర్నమెంట్‌లో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. 7 స్వర్ణ, 10 రజత పతకాలు సాధించారు. శుక్రవారం ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున రావు, పీడీ డాక్టర్ ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు.

